ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్త విభాగం

ప్రాంతీయ వార్తలు

తేదీ : 15.11.2025 సమయం : 1310 గంటలు

ముఖ్యాంశాలు

1. వచ్చేనెల 8, 9 తేదీల్లో రాష్ట్ర ప్రభుత్వం హైదరాబాద్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025' నిర్వహిస్తోంది. ఈ సమ్మిట్ విజయవంతానికి అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు.

2. సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు.

3. రాష్ట్రంలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ - ATCల ద్వారా వేలాది మందికి ఉపాధి కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని కార్మిక శాఖ మంత్రి డాక్టర్ వివేక్ వెంకటస్వామి చెప్పారు.

4. ఈరోజు భగవాన్ బిర్సాముండా 150 జయంతి సందర్భంగా జన జాతీయ గౌరవ దివస్ ను రాష్ట్ర వ్యాప్తంగా జరుపుకుంటున్నారు.

**సమ్మిట్**

వచ్చేనెల 8 , 9 తేదీల్లో హైదరాబాద్‌లో 'తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్-2025 ' ను నిర్వహిస్తున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్లోని కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో వివిధ శాఖల ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిన్న సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో

ప్రజాప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు పూర్తవుతున్న సందర్భంగా.. జరిగే ఈ సమ్మిట్ లో భాగంగా డిసెంబరు 9న తెలంగాణ రైజింగ్-2047 పాలసీ డాక్యుమెంట్‌ను ఆవిష్కరించుకోబోతున్నట్లు ముఖ్యమంత్రి తెలిపారు. ఈ పాలసీ ఆధారంగానే భవిష్యత్ నిర్ణయాలను తీసుకునేందుకు వీలుంటుందని ముఖ్యమంత్రి చెప్పారు. దార్శనికపత్రంతో పెట్టుబడిదారులకు ఒక స్పష్టత వస్తుందని ఆయన వివరించారు. అధికారులందరూ సమన్వయంతో వ్యవహరించి సమ్మిట్‌ను వైభవంగా నిర్వహించాలన్నారు. వివిధ దేశాల ప్రతినిధులు వస్తున్న నేపథ్యంలో వారి భద్రత విషయంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ముఖ్యమంత్రి అధికారుల్ని ఆదేశించారు.

డెస్క్

**పొన్నం**

సిద్దిపేట జిల్లా, హుస్నాబాద్ ప్రాంతంలో ఉపాధి అవకాశాలు పెరిగేలా చర్యలు తీసుకుంటామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. ఈ ఉదయం హుస్నాబాద్ లోని ఎల్లమ్మ చెరువులో 5 లక్షల పైచిలుకు విలువ చేసే 3 లక్షల చేప పిల్లలను మరో మంత్రి వాకిటి శ్రీహరి, ఫిషరీస్ చైర్మన్ మెట్టు సాయికుమార్ తో కలిసి చెరువులో వదిలారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం మాట్లాడుతూ. .. గురుకులాల్లో మటన్ , చికెన్ లాగా చేపలు కూడా మెనూలో ఉండాలని మంత్రి శ్రీహరి చెప్పడం శుభపరిణామమని , దీనికోసం ప్రయత్నం చేస్తామని తెలిపారు.

బైట్ : మంత్రి పొన్నం ప్రభాకర్

పిటిసి, సిద్దిపేట

**వివేక్ వెంకటస్వామి**

రాష్ట్రంలోని అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ల పనితీరులో క్రమశిక్షణను పెంపొందించాల్సిన అవసరం ఉందని, శిక్షణ ఇవ్వడం అనేది శిక్షకుల మొదటి ప్రాధాన్యత అని కార్మిక శాఖ మంత్రి డాక్టర్ జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈరోజు MCR HRDలో ఏటీసీల ప్రిన్సిపాళ్లతో నిర్వహించిన

సమీక్షా సమావేశంలో మంత్రి మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం నుండి ఏటీసీలకు అవసరమైన అన్ని రకాల సదుపాయాలు కల్పిస్తామని ఆయన హామీ ఇచ్చారు.

పీఎన్

**అదాలత్**

రాజీ మార్గంలో కేసులు పరిష్కారానికి సరైన వేదిక లోక్ అదాలత్ అని ఖమ్మం జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి. రాజ గోపాల్ చెప్పారు. ఈ ఉదయం న్యాయసేవాసదన్ లో ప్రత్యేక లోక్ అదాలత్ ను ప్రారంభించి , మాట్లాడుతూ.. ఇందులో లోక్ అదాలత్ లో కేసులను పరిష్కరించుకోవడం ద్వారా కక్షిదారులకు సమయం వృధా కాకుండా ఉంటుందని , అలాగే కోర్టు ఖర్చులు కూడా తిరిగి చెల్లించడం జరుగుతుందని చెప్పారు. రోడ్డు ప్రమాదంలో కాలు పోయిన బాధితుడు నరేష్ కి ఈ ప్రత్యేక లోక్ అదాలత్ లో 24 లక్షల 50 వేల రూపాయల పరిహారాన్ని ఓ ఇన్సూరెన్స్ కంపెనీ అందజేసింది.

పిటిసి, ఖమ్మం

**లోక్ అదాలత్**

ప్రత్యేక లోక్ అదాలత్ లో రాజీమార్గం ద్వారా సివిల్ , క్రిమినల్ కేసులు పరిష్కారం అవుతాయిన ఆసిఫాబాద్ జిల్లా జడ్జి ఎంవి రమేష్ అన్నారు. ఈరోజు నిర్వహించిన ప్రత్యేక లోక్ అదాలత్ కార్యక్రమంలో సీనియర్ సివిల్ జడ్జ్ , జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి కె. యువరాజ , ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జ్ జె.అనంతలక్ష్మితో కలిసి ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా జడ్జి మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో మూడు బెంచ్ లతో పాటు సిర్పూర్ లో ఒక బెంచ్ ఏర్పాటు చేశామన్నారు.

పిటిసి, ఆసిఫాబాద్

**అస్వస్థత**

నల్గొండ జిల్లాలోని నాగార్జునసాగర్ కమల నెహ్రూ ప్రాంతీయ వైద్యశాలలో వైద్యం వికటించి సుమారు 15 మంది చిన్నారులు అస్వస్థతకు గురయ్యారు. ఇటీవల వైరల్ ఫీవర్‌తో బాధపడుతూ వీరంతా ఆసుపత్రిలో చేరారు. నిన్న సాయంత్రం పిల్లలను డిశ్చార్జ్ చేసే సమయంలో వైద్యులు ఇంజక్షన్ ఇచ్చారు. వారతం ఇంటికి వెళ్లిన కాసేపటికే వాంతులు , విరేచనాలు కావడంతో తల్లిదండ్రులు తిరిగి వాళ్లను ఆసుపత్రికి తీసుకొచ్చారు. ప్రస్తుతం బాధితులకు ఐసీయూలో చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం చిన్నారుల ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉందని వైద్యులు తెలిపారు.

పిటిసి, నల్గొండ

**నవజాత శిశువులు**

జాతీయ నవజాత శిశువుల సంరక్షణ వారం ఈరోజు నుంచి జరుపుకుంటారు. ప్రతి సంవత్సరం నవంబర్ 15 నుండి 21 వరకు దీనిని నిర్వహిస్తారు. నవజాత శిశువుల ఆరోగ్యం , సంరక్షణ ప్రాముఖ్యతపై ప్రజల్లో అవగాహన కల్పించడం.. అలాగే , శిశు మరణాలను తగ్గించడం దీని ముఖ్య ఉద్దేశ్యం. భారత ప్రభుత్వ ఆరోగ్య, కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తుంది.

డెస్క్

**చిన్నపిల్లలు**

చిన్నపిల్లలు సెల్ ఫోన్ కు అలవాటు కావడం వల్ల కంటిమీద చాలా ప్రభావం పడుతుందని , నిద్రకు సంబంధించిన హార్మోన్స్ మీద ఎఫెక్ట్ పడి నిద్ర కూడా సరిగా పోలేరని , రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రి చిన్న పిల్లల డాక్టర్ సుభాషిణి చెప్పారు. చిన్నపిల్లల తల్లిదండ్రుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ.....

బైట్ – సుభాషిణి

పిటిసి, సిరిసిల్ల

**బిర్సా ముండా**

ఈరోజు స్వాతంత్ర్య సమరయోధుడు, గిరిజన నాయకుడు భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకుని దేశ ప్రజలు జనజాతి గౌరవ దివస్‌ను జరుపుకుంటున్నారు. గిరిజన చరిత్రను సజీవంగా ఉంచవలసిన ప్రాముఖ్యతను గుర్తిస్తూ కేంద్రం నవంబర్ 15న జనజాతి గౌరవ దివస్ ను పాటిస్తోంది. ప్రధానమంత్రి నరేంద్రమోదీ , కేంద్ర హోం మంత్రి అమిత్ షా బిర్సాముండాకు ఘనంగా నివాళులర్పించారు. ఇటు.. తెలంగాణ రాష్ట్రంలో కూడా భగవాన్ బిర్సాముండా జయంతి ఉత్సవాలు పలు జిల్లాల్లో ఘనంగా నిర్వహిస్తున్నారు.

ఆసిఫాబాద్ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో కలెక్టర్ వెంకటేష్ దోత్రే మాట్లాడుతూ.. బిర్సా ముండా స్ఫూర్తితో ప్రతి ఒక్కరు ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రమాదేవి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ దీపక్ తివారి, జిల్లా అటవీ శాఖ అధికారి నీరజ్ కుమార్ టిబ్రేవల్ , ట్రైబల్ వెల్ఫేర్ చీఫ్ ఇంజనీర్ శంకర్, జిల్లా పంచాయతీ అధికారి బిక్షపతి, శిశు సంక్షేమ శాఖ అధికారి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

డెస్క్, ఎన్ఎస్డీ, ఆసిఫాబాద్

**జార్ఖండ్**

ఈరోజు జార్ఖండ్ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం. 2000వ సంవత్సరంలో బీహార్ నుండి ప్రత్యేక రాష్ట్రంగా ఏర్పడిన జార్ఖండ్ 28వ రాష్ట్రంగా అవతరించిన ఈ రోజును స్మరించుకుంటారు. గిరిజన నాయకుడు బిర్సా ముండా జన్మదినోత్సవం కూడా ఈ రోజునే కావడంతో , ఈరోజు రాజకీయ, సాంస్కృతిక ప్రాముఖ్యతను సంతరించుకుంది.

డెస్క్, ఎన్ఎస్డీ

**భట్టి**

శాస్త్ర సాంకేతిక రంగాల్లో పురోగతితోనే దేశం బలోపేతమవుతుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. దీనికి దేశ ప్రథమ ప్రధాని జవహర్ లాల్ నెహ్రూ ధ్రుక్పథమే కారణమన్నారు. హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో నిన్న సాయంత్రం నెహ్రూ శాస్త్రీయ దృక్పథానికి 80 ఏళ్ల వేడుకలో భాగంగా 'ఎరైజ్, ఎవేక్.. సైంటిఫిక్ తెలంగాణ, స్ట్రాంగ్ ఇండియా' కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. 'ఈరోజు శాస్త్ర సాంకేతిక రంగాల్లో , ప్రజాస్వామికంగా ప్రపంచంలో దేశం అగ్రదేశంగా ఉండటానికి ఆనాడు నెహ్రూ వేసిన పునాదులే కారణమన్నారు.

డెస్క్

**కేంద్రం**

జోగులాంబ గద్వాల జిల్లాలోని ఎర్రవల్లి మండలం కొండేరు గ్రామంలో వడ్ల కొనుగోలు కేంద్రాన్ని అలంపూర్ ఎమ్మెల్యే విజయుడు ప్రారంభించారు. రైతులు పండించే వడ్లు మద్దతు ధరకు కొనుగోలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లపై ఎమ్మెల్యే ఆరా తీశారు. రైతులకు ఉపయోగకరంగా ఈ కొనుగోలు కేంద్రంలో ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.

పిటిసి, గద్వాల

**చలి**

రాష్ట్రంలో చలి తీవ్రత పెరుగుతోంది. ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయిలో పడిపోతున్నాయి. ఉదయం వేళలో ఈదురుగాలులు వీస్తూ , మంచు కురుస్తోంది. రాత్రివేళ కూడా ఉష్ణోగ్రతలు తగ్గుతున్నాయి. గడిచిన 24 గంటల్లో కామారెడ్డి జిల్లా బీబీపేట్‌లో అత్యల్పంగా 8.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదయ్యింది.

కామారెడ్డి, సిరిసిల్ల